

నైపుణ్యత కలిగిన చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - తాళ్లపూడి

నైపుణ్యత కలిగిన చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని హైదరాబాదుకు చెందిన గౌరవం ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం మండలంలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నైపుణ్యత కలిగిన విద్యపై అవగాహన కల్పించారు. పదవ తరగతి పూర్తి చేసిన తరువాత ఎలాంటి విద్యనభ్యసించాలనే దానిపై అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ చదివి దీని ద్వారా ఇంజనీరింగ్ వంటి నైపుణ్యత కలిగిన కోర్సులు చదువుకోవాలన్నారు. ఇదే పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పలువురు పూర్వ విద్యార్థులు, బిటెక్ పూర్తి చేసుకున్న విద్యార్థులు వారి అనుభవాలను ఈ సందర్భంగా విద్యార్థులతో పంచుకున్నారు.

రిజిస్ట్రేషన్‌లకు స్లాట్ బుకింగ్

- నేటి నుంచి రాజమహేంద్రవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభం
- పిడిఇ ద్వారా స్లాట్ బుక్ చేసుకునే అవకాశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్ విధానం నేటి నుంచి అమల్లోకి రానుంది. డైనమిక్ క్యూ మేనేజ్ మెంట్ సిస్టమ్ ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లా ప్రధాన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఈ సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అనంతరం దశల వారీగా ఈ స్లాట్ బుకింగ్ విధానం జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు విస్తరించనున్నారు. ఇళ్లు, స్థలాలు, పొలాలు కొనుగోలు రిజిస్ట్రేషన్ కోసం గంటల తరబడి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. ఇంతకు ముందు మంచి, చెడ్డా ముహూర్తాలు చూసుకుని రిజిస్ట్రేషన్లు చేసేవారు. మంచి ముహూర్తం ఉన్న రోజు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అర్ధరాత్రి వరకు పని చేసేవి. కానీ స్లాట్ బుకింగ్ విధానం ద్వారా అలా కుదరదు. ఇటు రిజిస్ట్రేషన్ సిబ్బందికి కష్టాలు తొలగనున్నాయి. నూతన విధానం కొంత వెసులుబాటు కల్పించే అవకాశం ఉంది. స్లాటు బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ అవసరం ఉన్న వాళ్లు వెబ్‌సైటులోకి వెళ్తే అందుబాటులో ఉన్న స్లాట్లు కనిపిస్తాయి. క్రయవిక్రయదారుల్లో ఎవరో ఒకరు స్లాట్ బుక్ చేసిన వెంటనే వారికి ఒటిపి వస్తుంది. దానిని రిజిస్ట్రేషన్ సమయంలో రిజిస్ట్రారుకు చెప్పాల్సి ఉంటుంది. రాజమండ్రి రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ సేవలు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గంటకు 12 చొప్పున స్లాట్లు ఉంటాయి. ఒకసారి స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఆ సమయానికి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే అరగంటలో రిజిస్ట్రేషన్లు పూర్తవుతాయి. స్లాట్ సమయం నుంచి గంట లోపుగా స్లాట్ బుక్ చేసి ఉన్నవారు రాకపోతే రద్దవుతుందన్నారు. అందుబాటులో ఉన్న స్లాట్లు అనుగుణంగా మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్ బుకింగ్‌లకు డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీక్యూఎంఎస్) పాటి స్తారు. ఇప్పటికే అంచెలంచెలుగా వస్తున్న మార్పులకు అనుగు ణంగా రిజిస్ట్రేషన్ చేసుకునే కక్షిదారులకు కూడా నూతన విధా నంపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ స్లాట్ బుకింగ్ విధానంపై అనేక మందికి పలు సందేహాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేశారు.



నూతన విధానంలో ప్రయోజనాలు..

స్లాట్ బుకింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ల కష్టాలకు ఈ విధానంతో తెరదించుతామని ప్రభుత్వం చెబుతోంది. సేవల్లో జాప్యం, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా కక్షిదారులు మెరుగైన సేవలు పొందవచ్చు. స్లాట్ బుకింగ్ ద్వారా అపాయింట్‌మెంట్ తేదీ, సమయాన్ని కూడా ముందే తెలుసుకోవచ్చు. నిర్ణీత తేదీ, సమయంలో ఎటువంటి హడావుడి లేకుండా రిజిస్ట్రేషన్ పని పూర్తి చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గంటల తరబడి వేచి ఉండటం, ఆందోళన చెందడం ఇక కనిపించదు. కొనుగోలుదారులు, అమ్మకం దారులు, సాక్షులు తగిన సమయంలోనే రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు చేరుకోవడానికి వీలు కలగనుంది. పారదర్శకత మధ్యవర్తుల ప్రభావానికి తెరపడనుంది. అనధికారిక కార్యకలాపాలకు చెక్ పెట్టినట్లవుతుంది.

పబ్లిక్ డేటా ఎంట్రీ (పిడిఇ) పద్ధతి ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. అధికారిక వెబ్‌సైట్ డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డిక్యూఎంఎస్) లో చేసుకోవచ్చు. క్యూఆర్‌కోడ్ స్కాన్ చేయడానికి ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. స్లాట్ విధానం తొలుత ఆరంభమైంది కాబట్టి అనుమానాలు, సందేహాలుంటే అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకోవచ్చు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నూరు శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో నూరు శాతం గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మండల, డివిజన్, నియోజక వర్గాల అధికారులు, ప్రత్యేక అధికారులతో హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ ఎస్.భాస్కర్‌రెడ్డితో కలిసి ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మే 31 నాటికి జిల్లాలో 10,794 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి, ప్రారంభించేలా లక్ష్యం ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు 4,929(46శాతం) లక్ష్యాలను మాత్రమే సాధించామన్నారు. ఇంకా 5,865 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉందన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం విడుదల చేసిందన్నారు. దీనిపై లబ్ధిదారులకు అవగాహన కల్పించామన్నారు. అదనపు సాయం కోసం మార్చి 31తో గడువు ముగిసిందన్నారు. అయినప్పటికీ ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులు ముందుకు రావడంతో ఇంకా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ అవకాశం కల్పించిందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించని సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్, హౌసింగ్ డిఇ, ఎఇ, ఎంపిడిఒలను జవాబుదారీతనం చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఇంటి నిర్మాణం కోసం 5330 మంది లబ్ధిదారులు అంగీకారం తెలిపారన్నారు. వారిలో 3,378 మందికి రూ.7.64 కోట్లు విడుదల చేశామన్నారు. అనపర్తి, నల్లజర్ల, కొవ్వూరు, చాగల్లు, రాజమండ్రి అర్బన్, కొవ్వూరు అర్బన్ పరిధిలో అదనపు ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారులు ఎక్కువగా ఉన్నారన్నారు. ఆ మేరకు స్టేజి కన్వర్షన్ విధానంలో మెరుగైన పని తీరు ఉండాలన్నారు. ఇకపై ప్రతి వారం సమీక్ష చేస్తామన్నారు. ఇన్‌ఛార్జి హౌసింగ్ పీడీ ఎస్.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అదనపు ఆర్థిక సాయం విషయాన్ని మరోసారి క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి నిర్మాణం స్టేజి కన్వర్షన్ ఆధారంగా హౌసింగ్ అధికారులు జీతాలు చెల్లింపు జరపాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి, హౌసింగ్ ఐటి పర్సన్ టి.విద్యాసాగర్ పాల్గొన్నారు.

అమరావతి చిత్రకళా వీధి ఏర్పాట్లు పూర్తి

క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం లాలా చెరువు రోడ్డులో శుక్రవారం నిర్వహించనున్న అమరావతి చిత్ర కళా వీధి ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక(క్రియేటివిటీ అండ్ కల్చరల్) కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కళలకి తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ కళాకారుల చిత్ర ప్రదర్శనలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పర్యాటక శాఖ మంత్రి కందులు దుర్గేష్ చొరవ తో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే నిదులను రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధికి ఉపయోగిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఇప్పటికే చాలా మంది కళాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

నేడు లాలాచెరువు జైలు రోడ్డులో చిత్రకళావీధి ప్రదర్శన జరగనున్న నేపథ్యంలో నగరంలో కొన్ని ప్రాంతాలకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ మేరకు ఎస్‌పి డి.నరసింహంకిషోర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం రాత్రి 10 గంటల నుంచి శుక్రవారం రాత్రి 10 గంటల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. లాలాచెరువు జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు డిటిసి, జెఎన్ రోడ్, మోరంపూడి మీదుగా వెళ్లాలన్నారు. వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వెళ్లాల్సిన వాహనాలు కంబాలచెరువు, హైటెక్ బస్టాండ్, చిరంజీవి బస్టాండ్, కోరుకొండ రోడ్డు, క్వారీ సెంటర్, దానవాయిబాబు టెంపుల్ వైఎస్ఆర్ విగ్రహం మీదుగా లాలా చెరువు జంక్షన్‌కు వెళ్లాలని ఆయన ప్రకటనలో సూచించారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చాగల్లు

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా గిట్టుబాటు ధర ప్రకటించలేదన్నారు. 25 శాతం తమే ఉందని 17 శాతం వస్తే కొనుగోలు చేస్తామని, అప్పటి వరకూ పొలాల్లోనే ధాన్యం ఉంచాలని అధికారులు చెబుతున్నారన్నారు. వాతావరణ మార్పులతో ఎప్పుడు ఏం జరుగుతుంతో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. తప్పని పరిస్థితుల్లో దళారులకు అయిన కాడికి అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గిట్టుబాటు ధర ప్రకటించాలని, గోనె సంచులు ఏర్పాటు చేయాలని, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని వారు కోరుతున్నారు.

భరత్‌కుమార్‌కి సత్కారం

ప్రజాశక్తి-గోకవరం

జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమితులైన ఆడపా భరత్ కుమార్‌ని టిడిపి నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను గుర్తించే ఏకైక పార్టీ టిడిపి అన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోకవరం టౌన్ ప్రధాన కార్యదర్శి జి.లాజరు, టిడిపి నాయకులు ఎం.జయరాజు, ముస్లిం మైనార్టీ సభ్యులు మహ్మద్ ఫిరోజ్ ఖాన్, ఎస్.యేసు, ఎ.వెంకన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం మండలంలోని 33/11 కెవి గోకవరం సబ్ స్టేషన్, 33/11 కెవి కొత్తపల్లి సబ్ స్టేషన్, 33/11 కెవి తంటికొండ సబ్ స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఈ కారణంగా ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో గోకవరం, కృష్ణునిపాలెం, రామన్నపాలెం, చిన్నూరు, కొత్తూరు, రామానుజపురం, వెంకటాపురం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, వీరలంకపల్లి, కొత్తపల్లి, రాజుపాలెం, గంగంపాలెం, ఠాకూరుపాలెం, కామరాజుపేట, జగన్నాధపురం, సూదికొండ, శివరాంపట్నం, భూపతిపాలెం, మల్లవరం, తంటికొండ, గాదులపాలెం, ఇటికాయలపల్లి, గోపాలపురం, గరగలంపాలెం, అచ్చియ్యపాలెం, ఇందుకూరుపేట, దేవారం, రావిలంక, పొత్తుకొండ, శరభవరం, ఉప్పయ్యపాలెం, నేలకోట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామన్నారు.

'తిరుమల' అవగాహనా సదస్సుకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో గురువారం జరిగిన అవగాహన సదస్సుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సదస్సుకు సుమారు 18 వేల మంది హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా ధృడంగా ఉండేలా చూడాలన్నారు. జాతీయ స్థాయి పరీక్షలైన జెఇఇ(మెయిన్స్), జెఇఇ(అడ్వాన్స్డ్), నీట్‌లకు సంబంధించి తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాలకన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు ఎక్కువగా అలవాటు పడుతున్నారన్నారు. మొబైల్‌లో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టం గురించి వివరించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలకు ఇచ్చే ఆస్తి కేవలం విద్య మాత్రమేనన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో దేశవ్యాప్తంగా జరిగే ఇంజనీరింగ్ (జెఇఇ మెయిన్స్ అండ్ అడ్వాన్స్) పరీక్షలలో 25 మంది పరీక్ష రాస్తే ఒక్కరికి మాత్రమే సీటు దొరుకుతుందన్నారు. తిరుమలలో ప్రతి నలుగురిలో ఒకరికి సీటు లభిస్తుందని తెలిపారు. మెడికల్‌లో దేశవ్యాప్తంగా జరిగే నీట్ పరీక్షల ప్రకారం 16 మంది పరీక్ష రాస్తే ఒకరికి సీటు లభిస్తుందని అదే తిరుమలలో ప్రతి ముగ్గురిలో ఒకరికి మెడికల్ సీటు వస్తుందన్నారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజిని దేవి మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులే మొదటి గురువులన్నారు. కాబట్టి పిల్లల నడవడికను చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు వారికి నేర్పాలన్నారు. విజ్ఞాన భారతి నేషనల్ సెక్రటరీ కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి మాట్లాడుతూ పిల్లల్లో ఆలోచనా విధానం, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటే పుస్తకాలను ఎక్కువగా చదివించాలన్నారు. ఈ సదస్సులో అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిందండ్రులు, తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు

రోడ్ల అభివృద్ధిపై ఎంఎల్‌ఎ బత్తుల సమీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధి పనులపై ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ గురువారం ఆర్‌అండ్‌బి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో రోడ్ల పటిష్టతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మిగిలిన ప్యాచ్ వర్క్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రఘుదేవపురం, మల్లంపూడి ఆర్‌అండ్‌బి రోడ్డు పనులను ఏప్రిల్ 15 నుంచి ప్రారంభించాలన్నారు. సీతానగరం రోడ్డు పనులను కూడా త్వరగా ప్రారంభించాలని సూచించారు. నియోజకవర్గంలో 326 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బి రోడ్లు ఉన్నాయని, అందులో 30 రోడ్లు ఎండిఆర్ కింద, 6 రోడ్లు స్టేట్ హైవేస్ కింద ఉన్నాయని తెలిపారు. రాపాక రోడ్డు మెట్ట గంగాలమ్మ గుడి వరకు దాదాపు మూడు కిలోమీటర్లు బాగా పాడైందన్నారు. వెంటనే ఆ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కోటి కేశవరం నుంచి నాగంపల్లి వరకూ మూడు కిలోమీటర్ల రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. రాజానగరం నుంచి గాదరాడ వరకూ పది కిలోమీటర్ల రోడ్డు, నాగంపల్లి నుండి చినకొండేపూడి వరకూ ఎనిమిదిన్నర కిలోమీటర్ల రోడ్డు, రాజానగరం-పిడపర్తి మూడున్నర కిలోమీటర్ల రోడ్డు, నామవరం-ఎర్రంపాలెం ఏడున్నర కిలోమీటర్ల రోడ్డు, కొండగుంటూరు-సంపత్ నగరం రోడ్డు, శ్రీకష్ణపట్నం-కానవరం-రాధేయపాలెం నాలుగు కిలోమీటర్ల రోడ్డును వెంటనే నిర్మించాలని ఆదేశించారు. నరేంద్రపురం, కొత్త వెలుగుబంద, చక్రద్వారబంధం రోడ్డు పది కిలోమీటర్ల ప్యాచ్ వర్క్ పూర్తయిందని, మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. సీతానగరం క్రీడా వికాస కేంద్రం పనులను త్వరితగతిన పూర్తి చేసి, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి ఎస్ఇ, ఇఇ, డిఇ, ఎఇలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ

సారా రహిత సమాజానికి సహకరించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సారా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని నిడదవోలు ఎక్సైజ్ సిఐ ఆర్.జయరాంసతీష్‌బాబు కోరారు. గురువారం మండలంలోని తాడిపర్రు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు అధ్యక్షతన సారా వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు. ఎవరైనా సారా తయారు చేసినా, సరఫరా చేసినా శిక్షార్హులు అవుతారన్నారు. సారా తయారీ, అమ్మకాలపై సమాచారం తెలిస్తే 14405 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు. సర్పంచ్ మాట్లాడుతూ ఉద్యోగాలు, సరైన సంపాదన లేక యువత పెడదారి పట్టే అవకాశం ఉందన్నారు. అటువంటి వారిని గుర్తించి, వారికి ప్రభుత్వం స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వీరభద్రం, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పి.ముసలయ్య, ఎస్ఐ ఐఎల్ఎస్.బాలాజీ, కానిస్టేబుళ్ల, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'రాజా'స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం రాజా పబ్లిక్ స్కూల్లో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పి.సూర్యప్రకాష్ మాట్లాడారు. గ్రాడ్యువేషన్ డే నిర్వహణపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. విద్యార్థులు ఉత్తీర్ణత స్థాయికి చేరుకోవాలని కోరారు. వేసవి సెలవుల్లో విద్యార్థులను చదువుపై దృష్టి పెట్టే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్ వినియోగించుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎంతో చక్కగా చదువుకొని తమ ప్రతిభను కనబరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.రామనాగలక్ష్మి, రాజా పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమగ్ర కొలతల నిర్ధారణ కోసం రీసర్వే

ప్రజాశక్తి - కొవ్వూరు

భూముల రీ సర్వేపై అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో సిసిఎల్‌ఎ కమిషనర్ ఆదేశాల మేరకు సమగ్ర కొలతల నిర్ధారణ కోసం క్షేత్రస్థాయిలో రెండవ దశ రీ సర్వే నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. రెండవ దశ రీసర్వే పై కొవ్వూరు మండలం దొమ్మేరులో అవగాహనా ర్యాలీ, గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ భూ యజమానులు, రైతులు నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని సమగ్ర కార్యచరణ ప్రణాళికతో, క్షేత్రస్థాయి రీసర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆర్‌డిఒ రాణి సుస్మిత మాట్లాడుతూ రీ సర్వేలో తగిన వివరాలకు సంబంధించిన రికార్డులను అధికారులకు క్షేత్రస్థాయి సిబ్బందికి అందించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమం తహశీల్దార్ దుర్గాప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే,సర్వే బృందాల సభ్యులు పాల్గొన్నారు.

'అరుంధతీయులు అసామాన్యులు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - తాళ్లపూడి


తాళ్లపూడి కి చెందిన విజేత స్కూల్ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ జొన్నకూటి ప్రమోద్‌కుమార్ రచించిన 'అరుంధతీయులు అసమాన్యులు' పుస్తకాన్ని కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అరుంధతీయులకు చెందిన పలువురి ప్రముఖుల చరిత్రలు కలిగిన ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలాన్నరు. అన్ని వర్గాల ప్రజలకు సామాజిక స్పృహ కలిగించే విధంగా రచనలు చేస్తున్న ప్రమోద్‌కుమార్‌ను అభినందించారు. టిడిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారులతో ఎంఎల్‌ఎ సమీక్ష

ప్రజాశక్తి - కోరుకొండ

వేసవి కాలంలో నియోజకవర్గంలోని చెరువులు, కాలువల పూడిక తీత పనులు వేగంగా చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. గురువారం ఎంఎల్‌ఎ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం వచ్చేనాటికి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలు, కాలువలు, ఉప కాలువల్లో పూడికతీత పనులు, జంగిల్ క్లియరెన్స్, చెరువులలో పూడిక తీత పనులను పూర్తి చేయాలన్నారు. చాగల్నాడు, తొర్రిగడ్డ, వెంకటనగరం, పుష్కర పథకాల కింద చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలు అధికారులు ఈ సందర్భంగా ఎంఎల్‌ఎకు అందజేశారు.ప్రభుత్వానికి నివేదించి సాధ్యమైనంత త్వరలో వీటికి అనుమతులు తీసుకొస్తాని ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వారికి తెలిపారు.

కార్టూ'నిజం'



కెఎస్‌ఎస్‌ల నియామకంపై టిడిపి దృష్టి

ప్రజాశక్తి - సీతానగరం

కుటుంబ సాధికారత సారథుల నియామకంపై టిడిపి దృష్టి సారించింది. ఈ మేరకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డు వెంకటరమణచౌదరి నాయకులు, కార్యకర్తలకు కీలక సూచనలు చేశారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 60 ఓట్లను నిర్వహించే కుటుంబ సాధికారత సారథులను ఏప్రిల్ 5లో నియమించనున్నారు. ప్రతి గ్రామంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అన్ని పోలింగ్ బూత్‌లకు సంబంధిచి కెఎస్‌ఎస్‌ల కోసం పేర్లను ప్రతిపాదించాలన్నారు. గడువు దగ్గర పడుతున్నందున ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటివరకు సీతారాంపురం, ఇనుగంటివారిపేట, పురుషోత్తపట్నం, రాపాక, ముని కూడలి, వంగలపూడి, గరగలంపాలెం, శ్రీరంగపట్నం, కోటి గ్రామాలకు సంబంధించి పేర్లు అందాయన్నారు. మిగిలిన గ్రామాల నాయకులు కూడా వెంటనే స్పందించాలని కోరారు. టిడిపి సభ్యత్వ కార్డులు, సభ్యత్వ వివరాల జాబితాను పరిశీలించి, క్రియాశీలక నాయకులు, కార్యకర్తల పేర్లను కెఎస్‌ఎస్‌లుగా ఎంపిక చేయాలని సూచించారు. బూత్ నంబర్, కెఎస్‌ఎస్ పేరు, టిడిపి సభ్యత్వ నెంబర్, ఫోన్ నంబర్) ఒక కాగితంపై రాసి 8106712796 నెంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు. సందేహాలుంటే పలివెల శ్రీనివాస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ 8106712796 నంబర్లో సంప్రదించాలన్నారు.

సిసి కెమెరాల ఏర్పాటుపై సమావేశం

ప్రజాశక్తి - చాగల్లు

చోరీలు అరికట్టాలంటే సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుని సహకరించాలని చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర వ్యాపారులకు సూచించారు. గురువారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కిరాణా, వర్తక సంఘం వ్యాపారస్తులతో ఆయన సమావేశమయ్యారు. చోరీల నివారణపై అవగాహన కల్పించారు. ప్రతి షాప్‌లోనూ సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోఊవాలన్నారు. ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ సిసి కెమెరాలు పబ్లిక్ ఏరియా కవర్ అయ్యేలా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దీని వల్ల చోరీలను చాలా వరకూ అరికట్టే అవకాశం ఉంటుందన్నారు. చోరీ జరిగినా నిందితులను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు.

జాతీయ పోటీలకు జూహిత పయనం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థిని జూహిత జాతీయ స్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్(అండర్-17 విభాగం) పోటీల్లో పాల్గొనేందుకు పయనమైంది. జూహిత గుణ తొమ్మిదో తరగతి చదువుతోంది. ఏప్రిల్ 7 నుంచి 12వ తేదీ వరకు మణిపూర్‌లోని ఇంపాల్ నగరంలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొనుంది. గత సంవత్సరం సిల్వర్ మెడల్ సాధించిన జూహిత గుణ ఈ సంవత్సరం గోల్డ్ మెడల్ సాధించాలని హెచ్‌ఎం అంకం మల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెకు ఆల్ ది బెస్ట్ చెబుతూ ఘనంగా వీడ్కోలు పలికారు.


జూహితకు వీడ్కోలు పలుకుతున్న పాఠశాల విద్యార్థులు

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో నందిగూడెం గ్రామంలో కోళ్ల ఫారంలో పనిచేస్తున్న సతామీ కోటల్(30) ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయిందని పోలీసులు తెలిపారు. నందిగూడెం గ్రామంలో కాకర్ల దివాకర్, సంజీవ కుమార్ కోళ్లఫారం నడుతుపుతున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కొంత మంది కూలీలు ఇందులో పనిచేస్తున్నారు. సతామి కోటల్(30), సునీల్ కోటల్ సహజీవనం చేస్తూ కోళ్ల ఫారంలో కొంత కాలంగా పనిచేస్తున్నారు. బుధవారం ఆమె తోటి పని వారితో కొయ్యలగూడెం వారపు సంతకు వెళ్లి వచ్చింది. సునీల్ కోటల్ తన మొదటి భార్య బ్యాంకు ఖాతకు రూ.5వేలను పంపించాడు. ఈ విషయమై ఇరువురికీ తగాదా జరిగింది. ఆగ్రహంతం సతామీకోటల్ ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టుకుని సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకుంది. చుట్టూ పక్కల వారు తలుపులు పగలగొట్టి చూసేటప్పటికి ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. కిందకి దింపి చూడగా అప్పటికే చనిపోయింది. కోళ్ల ఫారం యజమాని ద్వారా సమాచారం తెలుసుకుని నందిగూడెం విఆర్ఒ కొత్తపల్లి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి చోరీ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ గ్రామ పరిధి లంక పొలాల్లో గోదావరి నది ఏటిగట్టు సమీపాన రైతుల మోటార్లకు విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌కో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లో బుధవారం అర్ధరాత్రి రాగి తీగలు చోరీకి గురైనట్లు స్థానిక రైతులు తెలిపారు. ఆ శాఖ అధికారులు ఇటీవల నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారన్నారు. అయితే గురువారం ఉదయం వచ్చేసరికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్తు సరఫరాను నిలిపివేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి దానిలోని రాగి తీగలను చోరీ చేసినట్లు గుర్తించమన్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ సుమారు రూ.2 లక్షల విలువ ఉంటుందని స్థానిక లైన్మెన్ తెలియజేశారు. దీనిపై సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బంది తగు చర్యలు తీసుకుని, ఆ ప్రదేశంలో మరొక ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.


ప్రమాదానికి గురైన లారీ

హోటల్‌లోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

తాడేపల్లిగూడెం నుంచి కె.గంగవరంకు ఎటుగట్టు మీదిగా ధాన్యం లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి మండల కేంద్రమైన కపిలేశ్వరపురం పుష్కరాల రేవు వద్ద ఆనుకుని ఉన్న హోటల్‌లోకి దూసుకు వెళ్లింది. హోటల్ నిర్వాహకులు మోటిపల్లి వెంకట రమణ (రవి) చెందిన హోటల్లోకి బుధవారం రాత్రి సుమారు ఒంటిగంట ప్రాంతంలో లారీ దూసుకు పోవడంతో షెడ్ తో పాటు వంట సామగ్రి పూర్తిగా దెబ్బతింది. రాత్రి సమయంలో హోటల్ నిర్వాహకులు ,అక్కడ ఎవ్వరు లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ బ్రేక్ పడకపోవడం వల్ల అదుపుతప్పి హెూటల్ లోకి దూసుకు వెళ్లిందని లారీ డ్రైవర్ సతీష్ తెలిపారు, దీనిపై రాజీ కుదిరినట్లు సమాచారం.


దగ్ధమైన బైకు

బైకు దగ్ధం కేసు నమోదు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఇంటి వద్ద పార్క్ చేసి ఉంచిన మోటార్ సైకిల్ ను దగ్ధం చేసిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సిహెచ్.రాజేష్ కథనం మేరకు భీమనపల్లి పంచాయతీ సూధాపాలెంకు చెందిన మట్టపర్తి శ్రీకృష్ణ ప్రభాకరరావుకు చెంది మోటార్ సైకిల్ తన ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో బుధవారం రాత్రి శ్రీ కృష్ణ ప్రభాకరరావు సమీప బంధువు గంప అనిల్ కుమార్ మోటార్ సైకిల్ పై పెట్రోలు పోసి నిప్పు పెట్టి అంటించినట్లు శ్రీకృష్ణ ప్రభాకరరావు భార్య లక్ష్మీ ప్రసన్న తమకు ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

చేనేత కార్మికులకు సోలార్ యూనిట్ల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికులకోసం అమలు చేస్తున్న స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా మంజూరైన సోలార్ యూనిట్లను గురువారం పంపిణీ చేశారు. ఆదివారపుపేటలోని శ్రీ శివ బాలయోగి మహరాజ్ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 25 మంది చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తుందని, ఈ స్కీం ద్వారా ఇప్పటికే జాకాడ మోటర్లు, మిషన్లు మంత్రి సుభాష్ చే పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధికారులు, కూటమి నాయకులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కోకో హబ్‌గా కోనసీమ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

కోనసీమ ప్రాంతంలో కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో సాగుకు అనువైన వాతావరణం ఉందని, ఆ దిశగా కోకో సాగు విస్తీర్ణాన్ని దశల వారీగా పెంచుతూ కోకో హబ్ గా జిల్లాను తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఉద్యాన అధికా రులను ఆదేశించారు .గురు వారం స్థానిక కలె క్టరేట్ నందు జిల్లాస్థాయి కోకో కమిటీ ఆధ్వర్యంలో ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్ర వేత్తలు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి కోకో కాయల కోత అనంతరం ప్రొసెసింగ్ యూనిట్ల స్థాపనకై చేపట్టాల్సిన చర్యలపై సమీ క్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో ఏక పంటగా కొబ్బరి సాగుతో విరాజిల్లేదని ఫీడ్ నల్లి తాకిడి తో కొబ్బరి దిగుబడి తగ్గిపో యి కేవలం కొబ్బరి పై ఆధార పడి రైతు మనుగడ సాగించ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి తరుణంలో రైతును అన్ని విధాలుగా ఆదుకుంది కోకో పంటని, కాబట్టి కొబ్బరిలో అంతర పంటగా సాగు చేయ డానికి అత్యంత అను కూలమైన వాతావరణం ఉందని నాటిన మూడో ఏడాది నుంచి దిగుబడి వస్తుందని కాయల నుండి తీసిన గింజలను నాణ్యతతో ప్రాసెసింగ్ చేయు విధానాల పట్ల స్థానిక రైతాం గానికి అవగాహన లేక పోవ డంతో గిట్టుబాటు ధరలు పొందలేకపోతున్న నేప థ్యంలో వెయ్యి ఎకరాలకు ఒక కామన్ పర్మింటేషన్ కేంద్రాన్ని ఒక ఎకరం స్థలంలో నెలకొల్పే దిశగా సమగ్ర ప్రతిపాదనలు రూపకల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు కాయలు కోత పులియబెట్టుట పెట్టే పద్ధతి, బుట్ట పద్ధతి, కత్రిమంగా ఎండబెట్టుట. గింజల గ్రేడింగ్, నిల్వ చేయ డం అంశాలకు సంబంధించి యూనిట్ నెలకొల్పేందుకు షెడ్లు నిర్మాణం మానవ వనరుల లభ్యత, వివిధ రకాల పరికరాలు ఏర్పాటు శాస్త్రవేత్తల సమన్వయంతో సమగ్రమైన ప్రతిపాదనలను రూపొందించి సమర్పించాలన్నారు. ప్రభుత్వ పరంగానే యూనిట్లు నెలకొల్పుతూ రైతుల నుండి నేరుగా కాయలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసి పూర్తి నాణ్యత ప్రమాణాలతో గింజలను రూపొందించి కంపెనీలకు విక్రయించడం జరుగుతుం దన్నారు.

నూతన వంతెనల నిర్మాణానికి చర్యలు

అమలాపురం పట్టణంలో ఇటీవల కాలంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిన కారణంగా నూతన వంతెనల నిర్మా ణానికి శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు గురువారం స్థానిక ఈదరపల్లి వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనంద రావు, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వంతెన స్థితిగతులు రాకపోకల అంశాలపై శాసనసభ్య లు జిల్లా కలెక్టర్ కి వివరించారు. వంతెనకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను వారు నిశితంగా పరిశీలించి వంతెన నిర్మాణానికి ఏ విధమైన అడ్డంకులను లేకుండా పూర్తిగా ఆక్ర మణలను తొలగిం చాలని ఆదేశించారు. వంతెన వద్ద రోడ్ల ఇరువైపులా ఉన్న ఆక్రమణల వివరాలను ఆర్‌డిఒ, తహశీల్దార్లు, సర్వేయర్లు కలెక్టర్‌కు రికార్డుల ఆధారంగా వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పి బి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రుణాల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలు చోట్ల వివిధ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికకు గురువారం ఇంటర్వ్యూలను అధికారులు నిర్వహించారు.

అంబాజీపేట: మండల పరిధిలో వివిధ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపికకు గురువారం ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపిడిఒ జివి.సరోవరరావు, ఆయా బ్యాంక్ మేనేజర్ లు, వివిధ కార్పొరేషన్ ల ఫీల్డ్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 1397 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోగా 979 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరైనారు.కార్యక్రమంలో మండలపరిషత్ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీ లు,మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం**: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపిడిఒ కె.రత్నకుమారి తెలిపారు. ఇందుకోసం 653 మంది లబ్ధిదారులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగా 402 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. **రామచంద్రపురం**: రామచంద్రాపురం మండల పరిషత్ కార్యాలయానికి గురువారం పెద్ద ఎత్తున అభ్యర్థులు పోటెత్తారు. 2404 మంది అభ్యర్థులు రుణాల కోసందరఖాస్తు చేసుకోగా వారిలో 1344 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. **ఆలమూరు:** వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఐ.రాజు ఆధ్వర్యంలో గురువారం బ్యాంక్ అధికారుల సమ క్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రాజు మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూలు రెండు రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజున 379 మందికి, రెండవ రోజున 378 మందికి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, కార్యదర్శులు వి.వేణి, సాయి ప్రసాద్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట సబ్‌డివిజన్ పరిధిలో ప్రస్తుతం పోలీసు యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉందని కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ఉత్సవాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు శాఖకు సహకరించాలని కోరారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి

కాట్రేనికోన: మండల వ్యాప్తంగా ఎక్కడైనా ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలులేదని ఎస్ఐ అవినాష్ హెచ్చరించారు. ఆయన గురువారం విలేకరు లతో మాట్లాడుతూ ఎవరైనాపై కార్యక్రమాలు నిర్వహించాలని కుంటే ముందస్తుగా అమలాపురం పోలీస్ సబ్ డివిజనల్ అధికారి వద్ద ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు ప్రజలంతా సహకరించాలని కోరారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో వెనకాడబోమని ఎస్ఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో కొండపల్లి గనిరాజు మాతృమూర్తి పెదకార్యం సందర్భంగా ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవత ఛైర్మన్ జుజ్జవరపు వెంకటకృష్ణప్రసాద్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మానవత డైరెక్టర్ ఆళ్ల వీరవెంకటసత్యనారాయణ, మానవత కుటుంబ సభ్యులు గూడపాటి రాజా, హరిబాబు, గారపాటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం నేడు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని బిసి, కాపు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఎంపిడిఒ వివివిఎస్.రామారావు తెలిపారు. 885 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి శుక్ర, శనివారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

ఇంటర్వ్యూలకు 251 మంది హాజరు

చాగల్లు: చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, యూనియన్ బ్యాంకు మల్లవరం మేనేజర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రుణాల ఇంటర్వ్యూలకు 251 మంది హాజరయ్యారు. కలవలపల్లి, మార్కొండపాడ, నందిగంపాడు, ఎస్.ముప్పవరం, ఊనగట్లకు చెందిన 332 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపిడిఒ తలెఇఆపరు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

నేడు దేవరపల్లిలో లైన్స్ మెయింటెనెన్స్ నిమిత్తం 33/11కెవి దేవరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 11కెవి దేవరపల్లి మార్కెట్ ఫీడరు, 11కెవి దేవరపల్లి హెడ్ క్వార్టర్ ఫీడర్లకు సరఫరా ఉండదని ఇఇ ఎన్.నారాయణఅప్పారావు తెలిపారు. వీటి పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 7:30 గంటల నుంచి మధ్యాహ్నం 1. 30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని తెలిపారు.

నేడు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం మిర్తిపాడు సబ్ స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతులు నిర్వహించనున్నట్టు ఇఇ దాట్ల శ్రీధర్‌వర్మ తలెఇపారు. ఈ కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్టు తెలిపారు. మిర్తిపాడు, ఉండేశ్వరపురం, బొబ్బిలంక, ములకల్లంక గ్రామాలకు, వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలని వినతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం


వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును పెంపు చేయాలని ముమ్మిడివరం నగర పంచాయతీ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. రాష్ట్ర కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అనుబంధ సంస్థ సిఐటియు పిలుపు మేరకు గురువారం నగర పంచాయతీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెట్టా శివ ప్రసాద్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో కమిషనర్ రవివర్మ కు పలు డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శివ ప్రసాద్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం లేక చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు/ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల వలె ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంపు చేయాలన్నారు. ఇప్పటి వరకు అమలౌతున్న ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని, ప్రయివేటు ఏజెన్సీల ఏర్పాటు విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కషి చేయాలని డిమాండ్ చేశారు. పరిష్కారం కానీ పక్షంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం శ్రీనివాసరావు, ఎన్.అరుణ్ కుమార్, జి.రమేష్, సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎస్ఎన్‌వై వి.రామరాజు, పి.రవీంద్ర, ఆర్.అరుణ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ హెచ్‌సి శ్రీనివాస్‌కు ఎస్ఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఆలమూరు


గెద్దం శ్రీనివాసరావు

ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న గెద్దం శ్రీనివాసరావుకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించింది. ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న హెచ్‌సిలకు పదోన్నతులు కల్పించడంలో భాగంగా ఆలమూరు కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాస్‌కు ఉద్యోగన్నతి లభించింది. ఆయన ఆలమూరులోనే బాధ్య తలు స్వీకరించారు. ఎక్సైజ్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ ను ఎక్సైజ్ ఎఎస్.అమర్‌బాబు, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు అభినందించారు.

7న బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి- రామచంద్రపురం

రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నటు ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి టి. చలపతి కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలు వరకు నిర్వహిస్తారన్నారు. అదే రోజు కౌంటింగ్ నిర్వహి స్తామన్నారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, స్పోర్ట్స్ , కల్చరల్ పదవులకు ఇద్దరు ఇద్దరు చొప్పున ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయడంతో వారి మధ్య పోటీ ఉంటుందన్నారు. మహిళా న్యాయవాదుల ప్రతినిధిగా లకాని పద్మ కమల కుమారి ఒకరే నామినేషన్ వేయడంతో ఆమె ఏకగ్రమయ్యారని వివరించారు.

సాధారణ కాన్పులపై అవగాహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి నందు గురువారం గర్భిణులకు సాధారణ కాన్పుపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ వైద్యురాలు బి.సాయి శృతి మాట్లాడుతూ గర్భిణులకు సాధారణ కాన్పు వల్ల తల్లీబిడ్డకు క్షేమమని పేర్కొన్నారు. ప్రసవం జరిగిన వెంటనే శిశు వుకు ముర్రిపాలు పట్టించడం ద్వారా వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి వైద్యులు, గర్భిణులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి ఇసిజి యంత్రం బహూకరణ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని గురువారం గ్రామానికి చెందిన సంకాబత్తుల సుబ్బారావు మనవడు బిరద సూర్య ప్రకాష్ ఇసిజి మెషీన్‌ను బహూకరించారు. దీనిని రాగం రామచంద్రరావు ప్రారంభిం చారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామాల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు ,మాజీ సర్పంచులు సంకాబత్తుల స్వామి కాపు, కొండేటి నాగేశ్వరరావు, అంగర ఉప సర్పంచ్ యర్రా వీరన్న బాబు తదితరులు పాల్గొన్నారు.